క్లుప్తంగా

గ్రామీణ విలేకరుల సంక్షేమ కమిటీ రాష్ట్ర సభ్యుడిగా శ్రీనివాసరెడ్డి

రామాయంపేట(మెదక్): రాష్ట్ర గ్రామీణ విలేకరుల సంక్షేమ కమిటీ (ఐజేయూ) సభ్యుడిగా మెదక్‌కు చెందిన సీనియర్ జర్నలిస్ట్ కంది శ్రీనివాసరెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు విరాహత్ అలీ ఉత్తర్వులు జారీచేశారు.

రైల్వేస్టేషన్‌లో బాలుడు

వదిలేసిన గుర్తుతెలియని వ్యక్తులు



చేగుంట(తూప్రాన్): రైల్వేస్టేషన్‌లో బాలుడిని గుర్తుతెలియని వ్యక్తులు వదిలేసినట్లు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం మండల కేంద్రంలోని వడియారం రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తులు రెండేళ్ల బాలుడిని వదిలేసి వెళ్లగా, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. బాలుడి కోసం ఎవరైనా వస్తారని రెండు రోజుల పాటు చేగుంటలోనే ఉంచినా.. ఫలితం లేకపోయిందన్నారు. శనివారం బాలుడిని జిల్లా బాల సంరక్షణ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. బాలుడికి సంబంధించిన బంధువులు ఎవరైనా ఉంటే చేగుంట పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దాలి



వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు

పెద్దశంకరంపేట(మెదక్): విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దాలని ఎంఈఓ వెంకటేశం అన్నారు. శనివారం మండలంలోని మంథని పాఠశాలలో నిర్వహించిన విద్యా, వైజ్ఞానిక మేళాను ఆయన పరిశీలించారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను ఉపాధ్యాయులు వెలికితీయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగనాథ్‌రావు, సిబ్బంది వినోద్ పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందిస్తున్న బీఎన్‌రావు హెల్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు

మెదక్ కలెక్టరేట్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథాలయానికి కరీంనగర్‌కు చెందిన బీఎన్‌రావు హెల్త్ ఫౌండేషన్ వారు పోటీ పరీక్షల పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ మాట్లాడుతూ.. జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన పుస్తకాలను అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బీఎన్‌రావు హెల్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నరేందర్ మాట్లాడారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఫౌండేషన్ వ్యవస్థాపకులు నరేందర్‌ను సన్మానించారు.
అనంతరం బీకాం విభాగంలో నూతనంగా చేరిన విద్యార్థులకు ఓరియంటేషన్ నిర్వహించారు. కార్యక్రమంలో వాణిజ్య శాస్త్ర విభాగ అధిపతి డా. శరత్‌రెడ్డి, ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, తెలుగు విభాగ అధిపతి డాక్టర్ వామనమూర్తి, లైబ్రరీ ఇన్‌చార్జి డాక్టర్ చంద్రశేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సరిపోను ఉపాధ్యాయులను నియమించాలి

హవేళిఘణాపూర్(మెదక్): జీవో నెంబర్ 25ని సవరించి 20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చూడాలని టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షులు ప్రణీద్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. నూతన నియామకం చేపట్టేంత వరకు విద్యావాలంటీర్లను నియమించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐలయ్య, నాయకులు శేఖర్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఈటలను కలిసిన బీజేపీ మండల నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): బీజేపీ పార్టీలో చేరిన నాయకులు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను ఆయన నివాసంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన పురం మహేశ్‌కు పార్టీ కండువా కప్పారు. అనంతరం ఆయన వారికి పలు సూచనలు చేసినట్లు తెలిపారు. వీరి వెంట బీజేపీ నాయకులు తదితరులున్నారు.

ఆక్సిజన్ ట్యాంకు వృథా

● ట్రాన్స్‌ఫార్మర్ కోసం ఏడాది క్రితమే డబ్బులు చెల్లింపు ● అత్యవసర రోగులకు తప్పని ఇబ్బందులు



ఆక్సిజన్ ఉత్పత్తి కోసం ఏర్పాటు చేసిన ట్యాంకులు, ఇతర పరికరాలు

నర్సాపూర్: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.30లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ట్యాంకు నిరుపయోగంగా ఉంది. దీంతో అత్యవసర వైద్య సేవలకు వచ్చే రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆస్పత్రుల్లో నిరంతరంగా ఆక్సిజన్ సరఫరా పద్ధతిని అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రూ.సుమారు 30లక్షల వ్యయంతో కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ కార్యక్రమం కింద లిక్విడ్ ఆక్సిజన్ ట్యాంకును మంజూరు చేసింది. ఏడాదిన్నర క్రితమే ట్యాంకు ఏర్పాటు నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేశారు. అలాగే ఏడాది క్రితం కరెంట్ కనెక్షన్ నిమిత్తం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం రూ.4 లక్షలు చెల్లించారు. అయితే.. ఇంత వరకు కరెంట్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో ఆక్సిజన్ ట్యాంకు నిరుపయోగం ఉంది. కాగా, ట్యాంకును వినియోగంలోకి తేలేకపోవడంతో షెడ్డు లోపల పక్షులు ఉంటున్నాయి. ఫలితంగా వ్యర్థాలు వేయడంతో షెడ్డు లోపల అధ్వానంగా మారింది.

ట్రాన్స్‌ఫార్మర్ కోసం దరఖాస్తు చేశాం

ఆక్సిజన్ ట్యాంకుకు కనెక్షన్ కోసం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని రూ.4 లక్షలు విద్యుత్ శాఖకు చెల్లించామని ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ మీర్జానజీంబేగ్ తెలిపారు. డబ్బులు చెల్లించి ఏడాదైనా ఇంత వరకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయలేదని, దీంతో ఆక్సిజన్ ట్యాంకు వినియోగంలోకి రావడం లేదని చెప్పారు.

కరెంటు లోడ్ పెంచాం

ప్రభుత్వ ఆస్పత్రికి కరెంటు లోడ్ చాలా రోజుల క్రితమే పెంచామని విద్యుత్ శాఖ ఏఈ రాజ్‌కుమార్ చెప్పారు. ఆస్పత్రికి గతంలో 120 కేవీ విద్యుత్ సరఫరా ఉండేదన్నారు. లోడ్ పెంచాలని ఆస్పత్రి వర్గాలు కోరగా.. దానిని 250 కేవీ మేరకు పెంచామని ఆయన వివరించారు. లోడ్ పెంచినందున అవసరం మేరకు విద్యుత్ వినియోగించుకునే వీలు ఉంటుందని చెప్పారు.

పైసలిస్తేనే పని చేస్తరట!



తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితులు

అల్లాదుర్గం(మెదక్): తహసీల్దార్ కార్యాలయం అవినీతికి నిలయంగా మారింది. అధికారులు కొంత మంది బ్రోకర్లను పెట్టుకొని లంచాలు వసూలు చేస్తున్నారు. నిరుపేదలమని చెప్పినా.. పైసలివ్వకుంటే పౌతి రిజిస్ట్రేషన్ చేయమని చెబుతున్నారు. ఇదే విషయమై శనివారం తహసీల్దార్ ఎదుట బాధితులు మొరపెట్టుకున్నారు. అల్లాదుర్గం గ్రామానికి చెందిన అప్పాజీపల్లి సురేశ్, రాజు పౌతి రిజిస్ట్రేషన్ కోసం మీ సేవలో వారం క్రితం రూ. 6 వేలు చెల్లించి, స్లాట్ బుక్ చేసుకున్నారు. సురేశ్, రాజు తల్లిదండ్రులు మృతి చెందారు. తండ్రి అప్పాజీపల్లి అంజయ్య పేరుపై ఎకరా 36 గుంటల భూమి ఉంది. ఇద్దరు కొడుకులు సురేశ్, రాజు, కూతుర్లు లక్ష్మి, మమత ఉన్నారు. అయితే తండ్రి భూమి పౌతి చేయడానికి స్లాట్ బుక్ చేయగా, శుక్రవారం రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంది. వారు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లగా ఆర్ఐ సంతకం చేయకపోవడంతో రిజిస్ట్రేషన్ నిలిచిపోయింది. కార్యాలయంలో ఉంటున్న ఒక వ్యక్తి ద్వారా రూ. 20 వేలు ఇస్తే రిజిస్ట్రేషన్ చేస్తానని ఆర్ఐ చెప్పారని తహసీల్దార్‌కు బాధితులు చెప్పారు. ఈ విషయం బయటకు పొక్కడంతో ఆగమేఘాలపై సురేశ్, రాజులకు పౌతి రిజిస్ట్రేషన్ చేశారు. దీనిపై తహసీల్దార్ మల్లయ్యను వివరణ కోరగా.. రిజిస్ట్రేషన్ కోసం ఎవరికీ ఒక్క రూపాయి ఇవ్వొద్దన్నారు. ఎవరైన డబ్బులు అడిగితే తమ దృష్టికి తేవాలన్నారు.

గురుకులంలో సమస్యలు పరిష్కరించండి



కౌడిపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్టీ గురుకుల ఉపాధ్యాయులు

ఎస్టీ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ఫణికుమార్

కౌడిపల్లి(నర్సాపూర్): గురుకుల పాఠశాల, కళాశాలలో సమస్యలను పరిష్కరించాలని ఎస్టీ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ఫణికుమార్, ఉపాధ్యాయులు పేర్కొన్నారు. శనివారం గురుకులాల జేఏసీ పిలుపు మేరకు కౌడిపల్లిలోని ఎస్టీ గురుకుల పాఠశాలకు హాజరైనప్పటికీ ఉపాధ్యాయులు విద్యబోధన బహిష్కరించి చాక్‌డౌన్, పెన్‌డౌన్ చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అద్దెభవనంలో కొనసాగుతున్న గురుకులాలకు శాశ్వత భవనాలు నిర్మించి మౌళిక వసతులు కల్పించాలన్నారు. ప్రతీ నెల ఒకటవ తేదీన జీతాలు చెల్లించాలన్నారు. కొత్త టైంటేబుల్ ఉపసంహరించుకొని ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు తరగతులు కొనసాగించాలని తెలిపారు. అన్ని గురుకులాలను ఒకే గొడుకు కిందకు తీసుకురావాలన్నారు. ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం గురుకుల పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌కు ఉపాధ్యాయులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నర్సింహ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



చిన్నశంకరంపేట(మెదక్): కస్తూర్బా పాఠశాలలో పారిశుద్ధ్య పనుల్లో ఈజీఎస్ సిబ్బంది

చిన్నశంకరంపేట(మెదక్): పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని ఎంపీడీఓ దామోదర్ అన్నారు. మండల కేంద్రంలో కస్తూర్బాగాంధీ పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవ నిర్వహించారు. ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామపంచాయతీ సిబ్బంది పాఠశాల ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ గిరిజరాణి, ప్రిన్సిపాల్ గీతా ఉన్నారు.

నార్సింగిలో...

నార్సింగి మండలంలోని మహిళ సమైఖ్య భవనం వద్ద స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. మహిళా సంఘం సభ్యులు పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆనంద్, ఐకేపీ ఏపీఓ అశోక్, సీసీలు శంకర్, సుల్తానా, ఈఓ నాగభూషనం పాల్గొన్నారు.

చందూర్‌లో..



చిలప్‌చెడ్(నర్సాపూర్): చందూర్‌లో రోడ్డును ఊడ్చేస్తున్న అధికారులు, నాయకులు, ప్రజలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామాల్లో అధికారులు, నాయకులు, గ్రామస్తులతో శ్రమదానం నిర్వహించామని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో సమిష్టిగా రోడ్లను ఊడ్చేయడంతో పాటు, పలు పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అందరి సహకారంతోనే గ్రామాల్లో వంద శాతం స్వచ్ఛత సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శరత్‌కుమార్, ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

మున్సిపల్ అభివృద్ధే లక్ష్యం: మున్సిపల్ చైర్‌పర్సన్

తూప్రాన్: మున్సిపాలిటీ అభివృద్ధే మా లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ మామిళ్ల జ్యోతికృష్ణ పేర్కొన్నారు. శనివారం పట్టణంలో రూ.1.50 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ సహకారంతో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి కృషి ఫలితంగా తూప్రాన్ మున్సిపాలిటీకి రూ.1.50 కోట్లు ఎస్‌డీఎఫ్ నిధులు నుంచి మంజూరు అయినట్లు తెలిపారు. అనంతరం 6వ వార్డు కౌన్సిలర్ జ్యోతిరవీందర్ గుప్తా అధ్యక్షతన మారుతీ నగర్‌లో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్రీనివాస్, కౌన్సిలర్లు జ్యోతిరవీందర్‌గుప్తా, భగవాన్‌రెడ్డి, బాణాపురం రాజు, రఘుపతి, కాంగ్రెస్ నాయకులు నాగరాజు గౌడ్, ఉమర్, అనిల్, మారుతి నగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ

అందరూ కలిసి మెలిసి ఉండాలి

జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్‌పర్సన్ అనిత



లోక్ అదాలత్‌లో పాల్గొన్న జడ్జి అనిత, న్యాయవాదులు, పోలీసులు, ఇతర ప్రతినిధులు

నర్సాపూర్: కోపాలను పక్కన పెట్టి అందరూ ప్రేమానురాగాలతో కలిసి మెలిసి ఉంటూ సమస్యలు పరిష్కరించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్‌పర్సన్ అనిత పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని కోర్టులో రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సౌజన్యంతో జాతీయ లోక్ అదాలత్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు క్షణికావేశంలో తగాదా పడి కేసులు నమోదు చేసుకొని కోర్టు చుట్టూ తిరుగుతూ తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దన్నారు. కోపాలను పక్కన శాంతియుతంగా మాట్లాడుకొని కేసుల్లో రాజీపడాలని సూచించారు. లోక్ అదాలత్‌లో పలు కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో ఏపీపీ శ్రీనివాస్, ఏజీపీ సుధాకర్, ఎస్ఐ లింగం, లోక్ అదాలత్ బెంచ్ సభ్యుడు మధుశ్రీ, లీగల్ సర్వీస్ న్యాయవాది స్వరూపరాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, పలువురు న్యాయవాదులు శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణ, ఆనంద్‌కుమార్, రాజునాయక్, సాయిరాం, రవినాయక్, పలు బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

తుది ఓటరు జాబితా ప్రదర్శన



ధర్మాసాగర్‌లో ఓటర్ జాబితా

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల ఆవరణలో శనివారం తుది ఓటరు జాబితాను ప్రదర్శించామని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల కోసం గ్రామాల్లో వార్డుల వారీగా ఓటరు జాబితా సిద్ధం చేశామన్నారు. గత ఓటర్ జాబితాలో పలువురు ఓటర్ల తప్పొప్పులు, సవరణలు అన్నింటిని పరిశీలించి, తది ఓటరు జాబితా గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించామన్నారు.
కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో వార్డుల వారీగా తుది ఓటర్ జాబితాను ప్రదర్శనకు ఉంచినట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ శనివారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వారం ఓటరు జాబితా ప్రదర్శించగా, అభ్యంతాలు స్వీకరించి తుది జాబితాను సిద్ధం చేసినట్లు చెప్పారు. దీంతో ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు గ్రామంలోని ఓటర్ల సంఖ్య ఆధారంగా వార్డులను విభజించి ఓటర్లు జాబితాను సిద్ధం చేసి ప్రదర్శించారు. మండలంలో కొత్తగా ఏర్పాటు కానున్న ఆరు గ్రామ పంచాయతీల్లో సైతం వార్డుల వారీగా ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్నామన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలి



శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎంఈఓ నీలకంఠం

150 మంది విద్యార్థులకు శిక్షణ

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో శిక్షణ శిబిరాలతో విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలని ఎంఈఓ నీలకంఠం పేర్కొన్నారు. నేషనల్ గ్రీన్ క్రాప్ ఆధ్వర్యంలో శనివారం మెదక్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన ఎంఈఓ విద్యార్థులకు ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ట్యూబ్ లైట్ మేకింగ్, సేంద్రియ ఎరువుల తయారుపై శిక్షణ ఇచ్చారు. ఈ శిబిరంలో జిల్లాలోని 55 పాఠశాలల నుంచి 55 మంది ఉపాధ్యాయులు, 150 మంది విద్యార్థులు పాల్గొని శిక్షణ పొందారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రాజశేఖర్, జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజలంతా ఐకమత్యంతో ఉండాలి

జిల్లా వ్యాప్తంగా శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పౌరహక్కులపై అవగాహన కల్పించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ.. అందరూ కలిసి మెలిసి ఉండాలని, ప్రజలు ఐక్యతతో ఉంటేనే గ్రామాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు.



పెద్దశంకరంపేట(మెదక్): మాట్లాడుతున్న తహసీల్దార్ గ్రేస్‌బాయి, ఎస్ఐ శంకర్



నర్సాపూర్ రూరల్: మాడాపూర్‌లో ..



చిలప్‌చెడ్(నర్సాపూర్): గంగారంలో ..



నిజాంపేటలో..



శివ్వంపేట(నర్సాపూర్): ఉసిరికపల్లిలో ..



హవేళిఘణాపూర్‌లో..



అల్లాదుర్గంలో..

సంక్షిప్త వార్తలు

◆ **ప్రింటర్, సౌండ్ సిస్టం అందజేత**

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని పొడిచన్‌పల్లి ప్రాథమిక పాఠశాలకు శనివారం దాతలు ప్రింటర్, సౌండ్ సిస్టం అందజేశారు. గ్రామానికి చెందిన గంగుల రజనీకాంత్‌రెడ్డి ప్రింటర్, ఉద్యోగ ఉపాధ్యాయ బృందం కలిసి సౌండ్ సిస్టం బహూకరించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలోని సరస్వతీ మాత విగ్రహానికి పూజలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఫాజిల్, ఏఎస్ఓ నవీన్, టీచర్లు సతీష్, రమేశ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

◆ **ప్రొటోకాల్ విస్మరించిన వారిపై చర్యలు చేపట్టాలి**

చిన్నశంకరంపేట(మెదక్): ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ విస్మరించిన అధికారులపై చర్యలు చేపట్టాలని నార్సింగి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బాబు, జీవన్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆరు నార్సింగిలో మాట్లాడుతూ.. ప్రజాక్షేత్రంలో డిపాజిట్ కూడా దక్కని శ్రీనివాస్‌రెడ్డికి ప్రభుత్వ కార్యక్రమాలకు పిలిస్తే సహించేదిలేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముజీబ్ పాషా, భూపతిరాజ్, రోమాల రాజు, నరేందర్, అంజనేయులు, అంజయ్య పాల్గొన్నారు.

◆ **పిచ్చిమొక్కల తొలగింపు**

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలో కోదండరామస్వామి, ఉమా మహేశ్వరస్వామి ఆలయాల వద్ద కోనేరులో పేరుకుపోయిన పిచ్చిమొక్కలను శనివారం తొలగించారు. సోమవారం నుంచి గ్రామంలో చిన్న బతుకమ్మ వేడుకల సందర్భంగా కోనేరులో బతుకమ్మలు నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. జేసీబీతో కోనేరులోని పిచ్చిమొక్కలతో పాటు చెత్తను తొలగించి, మహిళలకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి రమాదేవి తెలిపారు.

◆ **దాడులను అరికట్టాలి**

నిజాంపేట(మెదక్): ఎస్సీ, ఎస్టీల మీద జరుగుతున్న దాడులను అరికట్టాలని శనివారం మండల దళిత సంఘాల నాయకులు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యకు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ ఎస్టీలకు సంబంధించిన భూ వివాదాలు పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు రాంబాబు, లక్ష్మి, నర్సింలు, శంకర్, ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నిజాంపేట గ్రామ మాజీ ఉపసర్పంచ్ బాబు పాల్గొన్నారు.

◆ **పురాతన కట్టడాల ఫొటో ఎగ్జిబిషన్**

హవేళిఘణాపూర్(మెదక్): అంతర్జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకుల బాలుర పాఠశాలలో శనివారం ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించారు. మెదక్ జిల్లాలో కనుమరుగుతున్న చారిత్రక ప్రదేశాలను సంతోష్ ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా టేక్మాల్ మండలం వేల్పుగొండ తుంగరేశ్వరస్వామి ఆలయం, కొల్చారం జైన మందిరం, చందంపేట మెట్ల బావి, మెదక్ పట్టణంలోని బారాకమాన్, నవాబ్‌పేటలోని సమాధులు, వెల్దుర్తి కళా తోరణం ఇలా ఎన్నో ఏళ్ల చరిత్ర గల పురాతన కట్టడాలను పిల్లలకు వివరించారు. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరి మీద ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏటీపీ నాగరాజు, పాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **పౌష్టికాహారంపై అవగాహన**

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని సంగాయిపేట అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోష హాజరై మాట్లాడారు. బాలింతలు, పిల్లల తల్లులకు పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పిల్లల ఎదుగుదలకు తీసుకోవాల్సిన ఆహార పద్ధతులను తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల చిరుధాన్యాలు, కాయగూరలు, ఆకుకూరలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు స్వరూప, హైమావతి, లింగమణి, మంగ తదితరులు పాల్గొన్నారు. 28ఎస్ఆర్ఎస్62: మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోష

◆ **'కొత్త ప్రభాకర్‌రెడ్డి పదేళ్లలో ఏం చేశారో చెప్పాలి'**

చేగుంట(తూప్రాన్): బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో కొత్త ప్రభాకర్‌రెడ్డి దుబ్బాక నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నవీన్ అన్నారు. శనివారం చేగుంటలో ఆయన మాట్లాడుతూ ఎంపీ ప్రభాకర్‌రెడ్డి దుబ్బాకకు నిధులు మంజూరు చేయించలేదన్నారు. ప్రొటోకాల్ పేరుతో బీఆర్ఎస్ నాయకులు గొడవలు సృష్టించాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. లక్ష్మణ్
9502735264